
◆ కథానిక

# క్యాంపు



రేపు తెల్లారితే ఆయన కేంపుకెళతారని తెలిసి నప్పటినుండి మనసు మనసులో ఉండటంలేదు. ఆఫీసు సమయం తప్పిస్తే పెళ్లయి రెండేళ్లలో ఆయన నన్ను ఒక్క క్షణం కూడా ఒదిలి ఎక్కడికీ వెళ్లలేదు.

ఆయన ఉదయాన్నే కేంపుకెళ్లే హడావిడిలో వున్నారు. నేను రోజులా సమయానికి ఏదీ అందించే స్థితిలో లేను. వారం రోజులు వారు నాకు దూరంగా వుంటారన్న దిగులుతో ఏ పనీ చేయ బుద్ధి కావటం లేదు.



ఫైవ్‌స్టార్ హోటల్

బోనీకపూర్‌ను పెళ్ళాడి, ఓ పిల్లకు కూడా తల్లయిన శ్రీదేవి ఇప్పుడు ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌ను కట్టాలనుకుంటోంది. అందుకోసం స్థలం కావాలని కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకుంది.

రాత్రి ఆయన సూట్‌కేస్ అంతా సర్దేశాను. వారంరోజులు నాకు దూరంగా వున్నా నన్నే తలచుకోవాలని నా ఫోటో కూడా సూట్‌కేస్‌లో పెట్టాను. ఆ ఫోటో ఆయన తీసిందే. అదంటే ఆయనకెంతో ఇష్టం.

'ప్రియా' కేకేసారు ఆయన.

'వస్తున్నానండి' నా ఆలోచనలను ప్రక్కకి పెట్టి గబగబ మేడమీద గదిలోకి వెళ్ళాను.

"ప్రియా! త్వరగా భోజనం పెట్టు టైమవుతుంది. ఆఫీసు జీపు వచ్చే టైమయింది. వాళ్ళని వెయిట్ చేయించడం బాగోదు" అన్నారు మెడకు టై తగిలించుకుంటూ.

"అయిపోయిందండి, ఇదిగో వడ్డిస్తున్నాను" అంటూ కొంగు నడుముకు చుట్టుకొని అదే వేగంగా క్రిందకి దిగాను.

ఆయన భోజనం దగ్గర కూర్చున్నారు.


నేను మౌనంగా వుండిపోయాను అన్నీ వడ్డించాక.

ఆయన ముద్ద నోట్లో పెట్టుకుంటూ అన్నారు "ప్రియా ఏమిటి – క్యాంపు కెళతానన్నప్పటి నుండి దిగాలు పడిపోయి వుంటున్నావ్. నిన్ను వదిలి నాకూ వెళ్ళాలని లేదు.

కాని తప్పదు కదా? ఈవారం రోజులు ఎలాగోలా సరిపెట్టుకో. ప్రక్కింటి మీనాక్షితో నీకు ఎలాగూ కాలక్షేపం వుంటుంది. అంతగా అనిపిస్తే నీ మరిదింటికెళ్ళి రెండ్రోజులుండు సరేనా?" అన్నారు.

హడావుడిగా భోజనం ముగించారు.

ఆయన చేయి కడుక్కొని నన్ను దగ్గరకు తీసుకున్నారు. అంతలో బయట జీపు ఆగిన శబ్దం




అయింది.

ఆయన గబగబ పైకివెళ్ళి కోటు వేసుకొని చేతిలో సూట్‌కేసుతో రెండు నిమిషాల్లో క్రిందికి దిగి వచ్చారు. మరోసారి నా దగ్గరికి వచ్చి నా బుగ్గమీద ముద్దుపెట్టి హడావుడిగా జీపెక్కేసారు.

వీధిలో జీపు కనుమరుగయ్యే వరకు చూస్తుండిపోయాను. నాకు తెలియకుండానే కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి. నా కంఠంలో దుఃఖం రుద్ధమైంది. వెళ్ళి బెడ్‌మీద అలాగే వాలిపోయాను.

ఓ గంట తరువాతే క్రింద హాల్లో బజర్ మ్రోగింది.

కళ్ళు తుడుచుకొని, చెరిగిన జుట్టుని సర్దుకొని కిందికి దిగివచ్చాను. వీధి తలుపు తెరిచేసరికి మీనాక్షి ఎదురుగా వుంది.

"ఏంటి ప్రియా మీ ఆయన క్యాంపు కెళ్ళిపోయారా!?" అంటూ లోపలికి దారి తీసింది.

ఇద్దరం హాలులో ఎదురెదురుగా సోఫాల్లో కూర్చున్నాం.

మీనాక్షికి ముప్పైఅయిదేళ్ళుంటాయి. ఇద్దరు పిల్లలు హైస్కూల్ చదువులు చదువుతున్నారు. మీనాక్షి మొహం లక్ష్మీదేవిలా వుంటుంది. కాకపోతే పర్సనాలిటీ కాస్త భారీగా వుంటుంది.

వారంలో రెండుమూడు రోజులైనా మా ఇంటికి వచ్చి ఏవో కబుర్లు చెప్తు వుంటుంది. కాస్త సరదా మనిషి. కాకపోతే కాస్త ఛాదస్తం కూడా వుంది. గత సంవత్సరం నుండి మా ఇద్దరి మధ్య చనువు బాగా పెరిగింది.

"ఏంటి ప్రియా మీ ఆయన వెళ్ళాలని దిగులు పడుతున్నావా? అప్పుడే నాకూ కొత్తల్లో అలాగే వుండేది" చెప్పింది నా ముఖంలోకి చూస్తూ.

నేను బదులుగా నవ్వి వూరుకున్నాను.

మళ్ళీ అంది ఆవిడ "మీ ఆయన అప్పుడే క్యాంపులు పట్టారంటే నువ్వేదన్నా తక్కువ చేస్తున్నావా – ఆ – ఏంతక్కువ చేసినా, ఎక్కువ చేసినా ఈ మగాళ్ళంతా అంతేలే..."

నేను కళ్ళెత్తి చూసాను, ఆమె మాటలో ద్వందార్థం వినిపించినట్లయి.

"ఆహా మీవారు అలాంటి వారు కాకపోవచ్చులే. అయినా మన జాగ్రత్తలో మనం వుండాలి" అంది.

"ఏంటి మీనాక్షి?" ప్రశ్నార్థకంగా అడిగాను.

"ఇంతకీ భోం చేసావా" మాట మార్చబోయింది.

"భోజనం చేయను" చెప్పాను.

"అదేంటి బెంగపెట్టుకొని ఈవారం రోజులు భోజనం చేయడం మానేస్తావా!?" నవ్వింది మీనాక్షి.

నేనేమీ మాట్లాడవద్దు

"సర్లే ముందు భోజనం చేయి నేను మళ్ళీ రేపు తీరిక చూసుకొని వస్తాను" అంటూ లేచింది.

ఆమెను సాగనంపి తిరిగి నా గదిలోకి వెళ్ళి పడుకున్నాను

ఆయన తలపుల్లో నన్ను నేను మరచిపోవడానికి ప్రయత్నిస్తున్నాను

మాది ప్రేమ వివాహం. ఇరువైపులా పెద్దవాళ్ళ అంగీకారంతోనే పెళ్ళి చేసుకొన్నాం

ఆయన ఎం.బి.ఎ. చేశారు. బిజినెస్ మేనేజర్‌గా పెద్ద కంపెనీలో ఉద్యోగం. అభ్యుదయ భావాలు కలవారు. మావాళ్ళు సాంప్రదాయ ప్రకారం కట్నం ఇస్తానన్నా వద్దన్నారు. మాకు పెళ్ళయిన కొత్తలో

ఆషాఢమాసం అని మా అమ్మగారి ఇంట్లో వదిలి వచ్చారే గాని ఆ నెలరోజుల్లో కనీసం పదిరోజులన్నా నన్ను చూడటానికి వచ్చివుంటారు. నేనూ అంతే ఒక్కరోజు కూడా ఆయన్ను విడిచి వుండలేదు.

మాకు ఇప్పడప్పడే పిల్లలు వద్దనుకున్నాం. దానికి తగ్గట్టుగా డాక్టర్ని సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకొంటున్నాం.

ప్రక్కింటి మీనాక్షి మటుకు పిల్లల ప్రస్తావన తెస్తూ వుంటుంది. ఎంత త్వరగా పిల్లలు వుడితే అంత త్వరగా చేతికి అందుకొస్తారని. అంతే కాక పిల్లల అనుబంధంతో మగాళ్ళు ఇంటి పట్టనే వుంటారట. ఆమె చెపుతున్నప్పడల్లా నాకు నవ్వొస్తుంటుంది.

ఆరోజంతా భోజనం చేయబుద్ధికాలేదు.

ఉదయం వంట చేసి మేగజైన్ తిరగేస్తుంటే వచ్చింది మీనాక్షి.

క్రితంరోజు భోజనం లేక నా కళ్ళు లోపలికి పీక్కుపోయాయేమో నన్ను చూస్తూనే ఆ విషయం అడిగింది.

భోజనం చేసానని బుకాయించాను. ఆవిడ ఆ విషయం ఈ విషయం మాట్లాడాక అసలు విషయంలోకి దిగింది.

"మావారు ఎప్పడైనా క్యాంపుకెళ్ళడం చూసావా?" అడిగింది ఆవిడ

"ఏమో" అన్నాను."

"మా పెళ్ళయిన ఆరవ ఏటనే క్యాంపులు పెట్టుకోవడం మొదలెట్టారు మా ఆయన. అందులో కొన్ని ఆఫీసు వాళ్ళు పంపిస్తే మరికొన్ని ఆయన సొంతంగా క్యాంపులకని వెళ్ళేవారు" చెప్పడం ఆపి నావైపు చూసింది.

"సొంత క్యాంపులేంటి?!" అడగకుండా వుండలేకపోయాను.

"చెప్పకుంటే సిగ్గుచేటుగాని నీ దగ్గర నాకెందుకూ దాపరికం – అదేదో ఆడవాళ్ళ కొంపల్లో దూరేవారట!"

"నీకెలా తెలుసు?"

"ఆ– ఎన్నాళ్ళు తెలీకుండా వుంటుంది? మా ఆయన ఊరెళ్ళి వచ్చిన రెండుసార్లు సూట్‌కేస్‌లో సెంటుబాటిళ్ళు, లిప్‌స్టిక్‌లు, అవేవో బ్యూటీ పార్లర్లలో వాడే స్నోలు, సింగినాధాలు వుండటం చూసి నిలదీసాను. ఆయన నిజం చెప్పేవరకు నెత్తిమీద కూర్చున్నాను. రెండ్రోజులు భోజనం చేయకుండా మానేసాను. అయినా లాభంలేకపోయింది.

ఓ శుభ సందర్భంలో ఆయన ఇంట్లో లేనప్పడు ఎక్కడినుంచో ఫోన్‌కాల్ వచ్చింది. మా ఆయనతో మాట్లాడాలనంది ఓ ఆడకంఠం. దాని పేరు, అదీ చెప్పింది. మా ఆయన వచ్చిన వెంటనే నిప్పల వర్షం కురిపించాను. భగ్గుమనే మండిపోయి నిజం చెప్పేశారు. అంతే ఆరోజునుండి క్యాంపు మాట ఎత్తుతే ఒట్టు" చెప్పి లీలలు అలలుగా నవ్వింది మీనాక్షి.

ఆవిడ అలా నవ్వుతుంటే నాలో అనుమాన బీజం నాటుకోవడం ప్రారంభించింది. నాలుగురోజులు మీనాక్షి కబుర్లతో కాలక్షేపం అయిపోయింది. ఆ మరుసటిరోజు మావారు క్యాంపు నుండి రానేవచ్చారు.

ఆయన్ను సాదరంగా ఆహ్వానించలేకపోయాను. నాలో ఆయన చూసే చిరునవ్వు మాయమైంది. ఆయన కూడా వస్తూనే పొడిగా రెండుమాటలు మాట్లాడి బెడ్‌రూంలోకి వెళ్ళి పడుకున్నారు.

ఆయనకు కాఫీ కలిపి పట్టుకెళ్ళాను. 'ఏంటండీ అలా వున్నారు' అని అడగాల్సింది పోయి, "ఈవారం రోజులు నేనెలా వున్నానో ఒక్కసారైనా ఫోన్‌చేసి . కనుక్కున్నారా?" అంటూ అభియోగం చేసాను.

"సారీ ప్రియా – హెవీ వర్క్. అసలు భోజనం చేయటానికి కూడా టైం దొరికేదికాదు" ఆయన నుదిటిమీద నుండి చేయితీసి నా చేతిలోని కాఫీ కప్పను అందుకున్నారు.

కాఫీ సిప్‌చేసి "నీకోసం ఏం తెచ్చానో చెప్పకో చూద్దాం?" అన్నారు నన్ను దగ్గరకు తీసుకొంటూ.

నేను ఆయన. చేతుల్ని నెమ్మదిగా విడిపించుకుంటూ "నాకోసం ఆలోచించే టైం, గిఫ్ట్స్‌కొనే సమయం దొరికినందుకు సంతోషం" అన్నాను.

నాలో చెలరేగిన అనుమాన పిశాచాన్ని కప్పిపుచ్చుకోవడం సాధ్యపడటంలేదు. ఆయన ఆదేమీ పట్టించుకునే స్థితలో లేరు.

"నీ చేతులతో ఆ సూట్‌కేస్ తెరిచిచూడు" అన్నారు.

వెంటనే పక్కింటి మీనాక్షి మాటలు గుర్తుకొచ్చాయి. సూట్‌కేస్‌లో ఏదన్నా దొరికితే–?

గబగబ వెళ్ళి సూట్‌కేస్ తెరిచాను.

రెండు శారీ ప్యాకెట్స్, ఓ దంతంతో చెక్కిన భరిణ, ఇంపోర్టెడ్ సెంట్‌బాటిల్ కనిపించాయి. సెంట్ బాటిల్‌ని చూడగానే నా అనుమాన పిశాచానికి బలం వచ్చినట్లయింది. వాటన్నిటినీ పక్కనపడేసి మిగతా బట్టలు పైకి తీసాను. అడుగున నేను పెట్టిన నా ఫోటో, దాంతోపాటు ఓ మడతపెట్టిన కాగితం కనిపించాయి.

ఆ కాగితాన్ని చేతిలోకి తీసుకొని ఆదుర్దాగా మడతలు విప్పి చూసాను.

అనుకున్నదంతా జరిగింది అందులోని సంభోధనతో నా కళ్ళు ఆ కాగితంలో మిగతా రాతవెంట వడివడిగా పరిగెట్టాయి.

డియర్,

నిన్న మీరు వెళ్ళినప్పటి నుండి నా మనసు నా చెంత లేకుండాపోయింది. నిద్రలో మీరే, ఏ పని చేస్తున్నా మీరే ఏమిటో! మిమ్మల్నిలా వారానికొకసారి కలుసుకోవడం మళ్ళీ వారంరోజులు ఎదురుచూస్తూ వుండటం అబ్బా నేను భరించలేకపోతున్నాను.

ఇంకా ఎన్నాళ్ళు డియర్ ఈ విరహం? మీతో ఎప్పడూ వుండిపోయే దారి త్వరగా చూపించండి.

మళ్ళీ వారం ఎప్పడొస్తుందా అని ఎదురుచూస్తూ మీకోసం తపించిపోయే మీ

ఒక్కసారి నాకళ్ళు గిర్రున తిరిగాయి. ఆ మరుక్షణం జలజలా కళ్ళలో నీళ్ళు సుళ్ళుగా తిరిగి కిందికి రాలాయి.

ఏమైంది ప్రియా అంటూ ఆయన బెడ్ మీద నుండి దిగి నావైపుకు రాబోయారు.

"అక్కడే ఆగండి". గట్టిగా అరిచాను.

ఆ అరువుకు మావారు నివ్వెరపోయారు.

"ఎవరు రాసారు ఇది? నేనుకాక మరొకరు కూడా వున్నారా మీకు?" ఖంగుమంది నా స్వర్గం.

ఆ మాటతో మావారి ముఖ కవళికలు మారాయి. ఆయన గబగబ వచ్చి నా చేతిలోని కాగితాన్ని తీసుకొని చూసారు.

అంతే గట్టిగా నవ్వడం ప్రారంభించారు. ఆయన నవ్వుతుంటే నేను అయోమయ స్థితిలో పడిపోయాను. కొంతసేపటికి ఆయన నవ్వును బలవంతంగా ఆపుకొంటూ, నన్ను పొదివిపట్టుకొని చప్పన నా పెదాల మీద గట్టిగా ముద్దు పెట్టుకున్నారు.

"శ్రీమతి గార్కి నామీద చాలా అనుమానముందే– నన్ను శ్రీకృష్ణ పరమాత్ముడనుకుంటున్నారా?" అని తిరిగి నవ్వడం ప్రారంభించారు.

"ఆపండి" నాకు తెలియకుండానే నా గొంతు చిన్నబోయింది.

"మన ప్రేమని ఈ రెండు సంవత్సరాలలోనే మటాష్ చేసేసావా? పైపెచ్చ అభాండాలు వేస్తున్నావా? అన్నారుడు.

"ఇంతకీ ఈ ఉత్తరం ఎవరు రాసారు?" నిలదీసారు.

"ఇక రాణిగార్కి ఇద్దరి మధ్య జరిగిన ప్రేమాయణం గుర్తుచేయక తప్పదేమో! పిచ్చి ప్రియా – నీ దస్తూరీ నువ్వే గుర్తుపట్టలేకపోయావ్. గుర్తుందా! నేను హాస్టల్‌లో వున్నప్పడు శనివారం శనివారం ఈ రాణిగారి కోసం వార్డెన్‌కి మస్కాకొట్టి వచ్చేవాణ్ణి. నువ్వు కాలేజీ దుమ్మా కొట్టి నాతో హుడా పార్క్‌లో మధ్యాహ్నం నుండి సాయంత్రం దాగా కబుర్లు చెప్పేదానివి. ఆరోజుల్లోనే ఓసారి నువ్వు వెర్రెత్తిపోయి నువ్వు నాకు రాసిన ఉత్తరం ఇది. ఆ ఉత్తరమే ఈరోజు వరకు భద్రంగా దాచుకున్నాను. క్యాంపులో వున్న ప్రతిరోజు రాత్రి నిన్ను తలచుకుంటూ ఈ ఉత్తరాన్ని చదువుకున్నాను.

ఇప్పడన్నా ఈ ఉత్తరం ఎవరు రాసారో గుర్తొచ్చిందా?" అడిగారు నా బుగ్గమీద చిటికేస్తూ

అంతే నాలోని అనుమానపు పిశాచి మాయమైపోయింది. నా సంకుచిత బుద్ధికి సిగ్గుపడుతూ ఆయనన్ను అమాంతం కౌగిలించుకొన్నాను.

"నన్ను క్షమించండి" అన్నాను ఆయన్ను మరింత దగ్గరికి తీసుకొంటూ.